# ఈ జన్మకీ తృప్తి చాలు

విశ్వనాథ రమ

ఆ ఉత్తరం పదే పదే చదివిన శ్రీధర్‌లో ఏళ్ళ తరబడి అనుభవిస్తున్న మానసిక వేదన, నిరాశ రెక్క లొచ్చి ఎగిరిపోయిన ట్లనిపించింది. గుండెలో జలపాతాల్లో పొంగి పొరలుతున్న అమృతధారలు.

గతించిపోయిన జ్ఞాపకాల అవశేషాలతో అనుక్షణం అంతరాత్మతో ఘర్షణ అనుభవిస్తున్న మనసు మబ్బుల జల్లుల మధ్య సేద తీర్చుకొంటున్న అనుభూతితో అతడు ఉక్కిరిబిక్కి రయ్యాడు.

అంతలోనే ఏదో సందిగ్ధత.

ఆ గదిలో పేరుకుపోయిన నిశ్శబ్దం తాలూకు సెగ క్రమంగా అతణ్ణి క్రమ్మేసింది.

అస లెందు కిలా జరిగింది?

ఇలాంటి పరిస్థితి ఎదురౌతుందని ఏనాడైనా ఊహించాడా!

ఇప్పు డేం చెయ్యాలి.

కసిగా కరిగిపోతున్న కాలంలో ప్రతి క్షణం తను చేసిన తప్పుకి కుమిలిపోతూ మంగళ స్మృతులను నెమరువేసుకొంటూ శిలలా జీవితం సాగిస్తున్నాడు.

ఆ రూపం కళ్ళముందు మెదిలితే చాలు హృదయాంతరాళంలో ఏదో ప్రశాంతత.

మళ్ళా ఇన్నాళ్ళకి ఆ దేవత ప్రత్యక్ష మౌతోందని తెలిసినప్పుడు ఒక పక్క సంతోషం అవధులు దాటుతున్నా మరొక పక్క వేల కొలది ప్రశ్నలు వటవృక్షాలై ఊడలతో శరీరాన్ని పొడుస్తున్నాయ్.

అవును! చుట్టూ ప్రపంచానికి ఏం సమాధానం చెప్పగలడు. 'మాస్టారు దేవుడు లాంటివారు. అతని చల్లని చూపు మా పిల్లమీద పడితే చాలు. వాళ్ళు ఉన్నతు లౌతారు' అంటూ ఎందరో పొగడుతూంటే హృదయాంతరాళంలో ఏదో ఆక్రోశం.

ఆఖరికి అందరి సమక్షంలో తాళి కట్టిన అపర్ణ కూడా అనురాగపూరిత వదనంతో తనను దేవుడిలా కొలుస్తూంటే నేను దుర్మార్గుణ్ణి అంటూ గతం తాలూకు చేదు స్మృతుల్ని బయటపెట్టి కరడుకట్టిన మనోవేదన కడిగేసుకోవా లనిపించేది.

కాని గొంతుకి మనసుకి ముడిపడ్డ తెరలు బిగుసుకోవడంతో ఏదీ చెప్పలేకపోయేవాడు.

కాని... ఆనాటి వాస్తవాన్ని ఇప్పుడు బయటపెట్టక తప్పదు.

అంతవరకు జరిగిపోయిన జీవితంలో ఎవర్ని మభ్యపెట్టలేదు. ఏదో శక్తి తనను ముందుకి నడిపించింది.

ఇప్పటి పరిస్థితి దృష్ట్యా గతమంతా అపర్ణ ముందుంచాలి.

సముద్రమంత అభిమానాన్ని కళ్ళలో నింపుకొని తన నారాధించే అపర్ణ తన అర్థాంగి కావడం గొప్ప అదృష్టమేమో!

దేనికీ ఆమె ప్రశ్నించదు. భర్తకి తగ్గట్టుగా ప్రవర్తించడం తన కర్తవ్యంలా భావిస్తుంది.

చాలామందిలా ఆమెని శాసించడం, ఆధిక్యత ప్రదర్శించడం అనేది త నెరగడు. తనకుగా తను కొన్ని పరిమితులు ఏర్పాటు చేసుకున్నాడు.

కొడుకు ప్రకాష్ పుట్టాక మరీ ముభావంగా మారిపోయాడు. ఏర్పాటు చేసుకొన్న సరిహద్దుల మధ్య జీవితం సాఫీగా సాగిపోయింది. నీడలా వెంటాడే జ్ఞాపకాల చప్పుళ్ళు వింటూ నిస్తేజంగా శూన్యంలోకి చూస్తూంటే అనిపించేది. ఈ గుండె నిండా ఉన్న అశాంతిని ఎవరైనా తోడేస్తే బాగుణ్ణునని. అవ్యక్తమైన ఈ బాధ నుండి విముక్తి కలిగితే చాలని.

కాని... ఇది సాధ్యమయ్యే పనా!

మరి... ఇప్పుడు... ఈనాటికి మంగళ దగ్గరనుండి ఉత్తరం. కడుపులో కాయ తొలగించడానికి ఆపరేషన్ అవసరమని, అందర్నీ వదిలి ఏకాకిలా బతుకుతున్న తనకు అండగా ఎవరూ లేరని పదిహేను రోజులు మీ ఇంట్లో ఉండటానికి అనుమతి కావాలని ప్రాధేయపడుతూ రాసింది.

ఒక్కసారిగా శ్రీధర్‌లో ఏదో నిస్సత్తువ ప్రవేశించింది. నాటి స్మృతులు కళ్ళముందు తారసలాడాయ్.

పెద్దల సమక్షంలో కాకపోయినా పంచభూతాల సాక్షిగా ఆమె మెడలో తాళి కట్టాడు. ఆరు నెలలు కాపురం చేశాడు.

తరువాత విధి త మిద్దరి జీవితాలతో దారుణంగా ఆడుకొంది. పెనుతుపానులా ఇద్దరిలో విష జ్వరాలు ప్రవేశించాయ్.

ఎవరికీ తెలీకుండా ప్రేమించి పెళ్ళి చేసుకొని కన్నవాళ్ళని వదిలి దూరంగా వచ్చేశాక కూడా తమలో పిరికితనం, భయం చావలేదు.

జ్వర తీవ్రతవల్ల క్రుంగి కృశించిపోతున్న తరుణంలో తన కళ్ళముందు ఫ్రెండ్ సత్యం ఆప్తుడిలా కనిపించాడు. వెంటనే అతనికి ఉత్తరం రాశాడు.


క్రమంగా దారుణమైన సంఘటనలు వెల్లువలా వచ్చి పడ్డాయ్. సత్యం వస్తూనే చెప్పాడు త నింటి పరిస్థితులు.


చెల్లెలి పెళ్ళి కుదిరిందని, ఆ పెళ్ళి చెయ్యాలంటే తన పెళ్ళి ద్వారా వచ్చే కట్నం తల్లిదండ్రులకి ముఖ్యమని, తన వివరాలు తెలీకపోవడంతో తండ్రి మంచం పట్టాడని, వెంటనే ఇంటికి రమ్మనమని అతని అభ్యర్థన.

అవన్నీ విన్నాక తను మరీ కృంగిపోయాడు. అంతా విన్న మంగళ మనోనిబ్బరం కళ్ళలో ప్రతిఫలిస్తూండగా అంది.

"నాతో ఉన్నన్నాళ్ళు మీకు మనశ్శాంతి లేదు. ఈ ఆశ్రమ పాఠశాల్లో టీచర్‌గా నా బతుకు నే బతగ్గలను. కష్టాల్లో ఉన్న మీ వాళ్ళను ఆదుకోండి!"

ఆ మాటలకు స్తంభించిపోయాడు.






"త్యాగానికి కూడ [illegible]ద్దుంది మంగళా! మనసా వాచా నీతో కాపురం చేస్తున్న నేను ఇంకొక పెళ్ళికి సిద్ధపడలేను!" అంటూ భోరున ఏడ్చేశాడు.

దాని కామె విరక్తిగా నవ్వి అనునయంగా అంది - "బాధపడకండి. మీ మనను కల్మషం ఎరగనిది. ఇంకొకరైతే ఈ రోగిష్టిదాన్ని వదిలి ఏనాడో పారిపోయే వాళ్ళు. మన సంబంధాన్ని తీయని స్మృతిగా గుండెల్లో దాచుకుంటాను!"

పుల్లలా మంచాని కతుక్కుపోయిన ఆమెను వదల్లేక వదిలి పరిస్థితులకు లొంగిపోయాడు. తరువాత అపర్ణతో పెళ్ళి... జీవితం... అంత రొటీన్‌గా సాగిపోతోంది.

"అరగంట నుండి దీర్ఘాలోచనలో మునిగిపోయారు. కాఫీ తీసుకోండి!"


కెరటాల్లా ఉవ్వెత్తున ఎగిసిపడే ఆలోచనలతో అలసిపోయిన అతడు భార్య పిలుపుకి వాస్తవంలోకి వచ్చాడు.

## బానిసత్వం దోపిడీ

ముక్కు పచ్చలారని
మూడేళ్ళ కాపురం
బస్తా పుస్తకాలకు
కూలివైనప్పుడు
నా జాతిలో బానిసత్వం పుట్టింది.

"డొనేషన్ల", "కరప్షన్ల"
వేలకు వేలు దోచి
రంగు రంగుల బుట్టల్లో,
'టై' ల్లో "బెల్టుల్లో"
విద్యను బెడ్డింగా చుట్టి
వేలం వేసినప్పుడే
ఈ జాతిలో దోపిడీ పుట్టింది.

-పెండ్యాల సుబ్బారావు



ఫోటో: కె. కృష్ణారావు

కష్టసుఖాలు పంచుకొంటూ మమతానురాగంతో ప్రసన్నంగా కనిపించే ఆమె ముందు ఏదీ దాచా లనిపించలేదు. అన్ని కోరికలూ చంపుకొని యోగినిలా బతుకుతున్న మంగళను రకరకాలుగా చిత్రించాలనే భావన లేశమాత్రమైనా రాలేదు. వెంటనే ఒక నిర్ణయాని కొచ్చా డతను.

** ** **

ఆరుబయట వెన్నెల జలపాతంలా కురుస్తోంది. గత స్మృతులతో శతాబ్దాలుగా తడిసిన శిల్పంలా శ్రీధర్ అంతా అపర్ణకి చెప్పి చివరగా అన్నాడు.

"ఆమెకు నేను తప్ప చెప్పుకోతగ్గ వా ళ్ళెవరూ లేరు. ఆలుమగలుగా జీవితాన్ని పండించుకునే మధుర క్షణాల్ని విషమ పరిస్థితులుగా మార్చాడు భగవంతుడు. కాని ఒకరికోసం ఒకరు పుట్టినట్లుగా సేవ చేసుకొని అభిమానాన్ని పంచుకునే ఆ క్షణాలు అపూర్వమైన వనిపిస్తూంటుంది.

ఇప్పు డామె కడుపులో కాయ తొలగించుకోవడానికి ఈ ఊ రొస్తోంది. నేను పక్కనుంటే కొండంత తృప్తిగా ఉంటుందని రాసింది. కృతజ్ఞత ఊపిరిగా చేసుకొన్న ఆమె సహాయం చేసిన వాళ్ళని మరువదు. ఆమె మీదున్న అభిమానం, ఆరాధన నా గుండె లోతుల్లో చెరగని సంపదలా నిక్షిప్త మయ్యాయి. అందుకే జరిగిపోయిన గతాన్ని నీ ముందుంచుతున్నాను. నిర్దాక్షిణ్యంగా కసాయి కాలానికి వదిలేసిన ఆమె గురించి అనుక్షణం బాధపడుతూనే ఉన్నాను. ఇప్పు డామెకు చేసిన సహాయం వల్ల నాకు మనశ్శాంతిగా ఉంటుందని...!" సందిగ్ధంగా ఆమె వైపు చూశా డతను.

బయట వరండా గట్టుమీద కూర్చున్న అపర్ణ మొహంమీద పాల వెన్నెల స్వచ్ఛంగా మెరుస్తోంది.

లోయలోంచి వచ్చినట్లుగా ఉన్న అతని మాటలకి సన్నగా వణికిం దామె. ఎన్నేళ్ళుగానో సాగిపోతున్న వైవాహిక జీవితంలో అతన్ని ఏనాడూ శంకించలేకపోయింది. కారణం సరళ స్వభావంతో అందర్నీ ఆకట్టుకోవడమే. అప్పుడప్పుడు గంభీరంగా కనిపించే ఆ వదనం వెనుక సన్నటి బాధ దోబూచులాడినా ఎందుకో అర్థం చేసుకోలేకపోయేది.

కాని ఇప్పుడు తెలుస్తోంది. ఆమె స్మృతులు తలచుకొంటున్నప్పుడు అతని కళ్ళలో కనిపించే అనిర్వచనీయమైన అనురాగపు పొరల తాలూకు మెరుపుల వల్లరి.

ఆ బంధం ఎంత అద్వితీయమైంది కాకపోతే అత డెందు కిలా స్పందిస్తాడు? ఒక్కసారిగా అపర్ణలో సన్నటి కదలిక.

మెల్లగా గొంతు విప్పిం దామె.

"డబ్బు, బంధు జనం ఉన్న వాళ్ళ గురించి అందరూ పట్టించుకుంటారు. అనుభవాల రాపిడిలో అట్టడుగున నలిగిపోయే వారి శ్రేయస్సు ఎవరికీ అక్కర్లేదు. ఇన్నాళ్ళూ మ నిద్దరి మధ్యా ఆవిడ ప్రస్తావన రాలేదు. మీకు మనశ్శాంతి నిచ్చే ఏ పనైనా కాదంటానా!"

వెన్నెల వెలుగులో నైట్ క్వీన్ సువాసనల మధ్య ఆమె పలుకులు శ్రీధర్‌లో కోటి సితారలు మ్రోగించాయ్.

మళ్ళా హృదయాంతరాళంలో సందిగ్ధత.

"అపర్ణా! ఏ స్త్రీ కూడా భర్తతో సంబంధం పెట్టుకొన్న వ్యక్తిని చూడాలని, సేవ చేయాలని, కనీసం మాట్లాడాలని కూడా అనుకోదు. కాని... ఈ పరిస్థితులలో నీకు పూర్తిగా నిజం చెప్పడమే మంచి దనిపించింది. నా మాటల్లో అభ్యర్థన, ఆజ్ఞలు లేవు. ఆమె లాగే ప్రాధేయపడుతున్నాను!"

అతనివైపు కలవరంగా చూసిం దామె. తరువాత అంది - "మీ భార్యగా నన్ను కూడా సగటు స్త్రీలా భావిస్తున్నారా!"

మంగళ గురించి చెప్పాక ఎలాంటి తుపాన్ ఎదుర్కోవలసి వస్తుందోనని భయపడ్డ శ్రీధర్ సమ్రతతో కూడిన ఆమె జవాబుకి, సహృదయతకు లోలోపలే జోహార్లర్పించాడు.

పదిహేను రోజుల తరువాత...

పౌర్ణమి పరుచుకొన్న అందాలను కిటికీలోంచి గమనిస్తున్న మంగళ ఏవో గుర్తొచ్చినట్లు శ్రీధర్ మొహంలోకి ఆత్రంగా చూస్తూ అంది.

"రేపు ఉదయాన్నే వెళ్ళిపోతాను. మరి ఉండమని బలవంతం చెయ్యొద్దు. ఇప్పటికే మీరు కురిపించిన మమతానురాగంతో తడిసిపోయాను!"

"ఇప్పటికి ఎన్నోసార్లు ఆ మాట చెప్పావ్. కొత్త విషయాలు చెప్పకూడదా!"

మంగళ తల నిమిరా డతను. నిండు చంద్రోదయంలా నవ్విం దామె.

"అంతటా స్వచ్ఛత వెల్లివిరిసిన ఆ పాఠశాల నుండి త్వరలో రిటైరవుతాను. ఇన్నాళ్ళూ నన్ను అమితంగా అభిమానించే పిల్లలు, టీచర్ల మధ్య ఉండటంవల్ల ఒంటరితనం తెలిసేది కాదు. ఇకముందు ఎలా గడపట మనేదే సమస్య.

ఛస్తో... చావలేక బతుకుతో రాజీ పడలేక ఇలా ఎప్పటికో జీవితం ముగిసిపోతుం దనుకున్నాను. కాని మీ ప్రేమ మందిరంలో నా కింకా చోటుందని తెలిశాక అమృతపు ధారలతో గుండె నిండిపోయింది. ఈ తృప్తితో ఆనాటి తీయటి స్మృతుల మేలు కలయికతో శేష జీవితాన్ని గడవగలననే ధీమా ఏర్పడింది. నేను బతికున్నా పోయినా నా గురించి ఆలోచించే మన సుందనే భావన ఎంత తీయగా ఉందో! ఈ జన్మ కీ అదృష్టం చాలదూ!"

"అవేం మాటలు మంగళా! ఇది నా కర్తవ్యం!" చలించిపోతూ అన్నాడు శ్రీధర్.

కొన్ని నిమిషాలకే ఆమె నిద్రలోకి జారుకోవడం చూసి టీపాయ్ మీదున్న శాలువ తీసి కప్పాడు.

పసిపిల్లలా ఒద్దికగా పడుకొన్న మంగళని చూస్తుంటే అతని హృదయాంతరాళంలో ఏదో తృప్తి. తను కోరుకున్నట్లుగానే ఆపరేషన్ సవ్యంగా జరిగింది. అపర్ణ కంటికి రెప్పలా ఆమెను చూసుకొంది. తోబుట్టువుకి సేవ చేసినట్లుగా వేళకి అన్నీ అమర్చిపెట్టే అపర్ణని చూసి లోలోపలే ఆశ్చర్యపోయేవాడు.

కాని... రెండ్రోజులు క్రిందట వచ్చిన కొడుకు ప్రకాష్ మాటలు విన్నాక ఆమెలో ఏదో గంభీరత. ఇంజనీర్‌గా బొంబేలో సెటిలైన ప్రకాష్ ఎప్పట్నుంచో త మిద్దర్నీ పిలుస్తున్నాడు. తన కక్కడ పెద్ద క్వార్టర్ ఇచ్చారని, వృద్ధాప్యంలో కొడుకు దగ్గర ఉండటమే మంచిదని మరీ మరీ చెప్పాడు.

ఏమిటో! ఏ ప్రదేశంలో ఉన్నా తన జీవితంలో మార్పుండదు. పుస్తకాలు చదువుతూ, గతం తాలూకు జ్ఞాపకాల్ని నెమరువేసుకొంటూ కాలం గుర్రంలా పరిగెడుతూంది.

ఒక్కసారిగా అతని ఆలోచన్లు మంగళ మీదకు మళ్ళాయ్. స్త్రీలలో కారుణ్యమంతా ఆమెలో నిండి ఉందా అనిపిస్తూంటుంది. అపర్ణని చూసి రేణువంత అసూయ కూడా చెందకుండా స్నేహితురాల్లా ఎంత ఆత్మీయంగా మాట్లాడింది. ఈ ఐశ్వర్యాన్ని సుఖాన్ని అనుభవించలేకపోయాననే బాధ లేకుండా మళ్ళా తనున్న చోటుకే వెళ్ళిపోతానంటోంది. అందుకే కాబోలు. ఆ త్యాగమయి స్మృతుల నుండి ఎప్పటికి బయట పడలేకపోతున్నాడు.

కాని, ఒక్కటి మాత్రం నిజం.

పూర్వంలా ఇప్పుడు తనలో ఎలాంటి అశాంతి లేదు. గుండెలో కొండంత తృప్తి. వ్యక్తిగతంగా సమాజ పరంగా అంతర్మథనాన్ని ఇకముందు అనుభవించడు. తనలో కపటం లేనప్పుడు ఒకరి కెందుకు భయపడటం? ఇక ముం దెవ్వడైనా ఆమెకు సహాయం చెయ్యగలడు. ఈ జన్మ కీ తృప్తి చాలదూ! ఆ ఆలోచన పన్నీటి జల్లులా మనసుని తాకింది. మంగళ వైపు ప్రశాంతంగా చూసి బెడ్ రూమ్‌వైపు నడిచాడు.

** ** **

చీకటికి వెలుగుకి మధ్య ఉన్న పలుచని తెర కరుగుతున్న వేళ. ఎవరో తట్టి లేపినట్లయింది శ్రీధర్‌కి. ఎదురుగా ప్రకాష్.

"అమ్మ అరగంట ముందే స్టేషన్‌కి వెళ్ళిపోయింది. ఈ కవరు మీ కిమ్మంది!" అంటూ వడివడిగా వెళ్ళిపోతున్న ప్రకాష్‌ని ఎన్నో అడగాలనిపించినా విభ్రాంతిగా చూస్తూ ఉండిపోయాడు శ్రీధర్.

ఊహించని పరిణామానికి అతని ఒంట్లో సన్నటి జలదరింపు.

సేద తీర్చుకొంటున్న మనసుపై మరో పిడుగు.

అపర్ణ ఎందు కిలా చేసింది?

వణుకుతున్న చేతులతో కవరు విప్పాడు. అందులోంచి జారిపడ్డ ఉత్తరం వైపు అతని కళ్ళు పయనించసాగాయ్.

శ్రీవారికి...

అపర్ణ రాస్తున్న మొదటి ఉత్తరం. ఎంత ఆశ్చర్యం. ఔను మరి. ఇన్నేళ్ళుగా మ నిద్దరి మధ్యా ఎడబాటనేది లేదు. అందుకే భర్త వదిలేసిన స్త్రీలను చూసినా, పతంతువుల్ని చూసినా ఒక పక్క జాలి, బాధ మరొక పక్క మంచి మనసున్న మీ సన్నిధిలో ఉన్నాననే గర్వం కలిగేవి.

కాని... క్రమంగా నాలో ఏదో పరివర్తన. పెళ్ళయి సంవత్సరం తిరక్కుండానే భర్తని కోల్పోయిన సుగుణ, అందరూ ఉన్నా దిక్కులేని పక్షిలా ఆఫీసుల చుట్టూ పెన్షన్ కోసం తిరిగే శారదమ్మ... ఇలా ఎందరో విధివంచితులు రోజూ కళ్ళముందు కనిపిస్తూంటే వాళ్ళకి తోడుగా ఉండాలనే అభిలాష మొదలైంది. ఈ సేవలో కొండంత తృప్తితో పాటు మనశ్శాంతి కూడా పొందాను.

కాని... కాని నా జీవితం కోసం ఓ అభాగ్యురాలు తన బతుకునే త్యాగం చేసిందని మీ ద్వారా విన్నప్పుడు హృదయంలో ఏదో సంకుల సమరం. నిస్సారంగా సాగిపోతున్న ఎడారి జీవితంలోనే తృప్తిని వెతుక్కుంటున్న ఆమెని చూస్తూంటే నా మనోబలం మరింతగా పెరిగింది.

జీవితంలో అన్ని సుఖాలు పొందిన నాకు కావలసిం దిప్పుడు మానసిక తృప్తి. విశ్రాంతి. అవి కొడుకు ప్రకాష్ దగ్గర పుష్కలంగా దొరుకుతాయి. మోడులా జీవితాన్ని సాగిస్తూ కాస్తంత ఆదరణకు, సేవకు పొంగిపోతున్న మంగళకు ఇకముందు మీరు చేయూత నివ్వాలి. ఇది ఆజ్ఞ కాదు. మీలాగే ప్రాధేయపడుతున్నాను. ఆమె ఇక్కడే ఉండాలి. మీ ససన్నిధిలో ఉంటే నాకు తృప్తి. అందుకే వెళ్ళిపోతున్నాను!

-అపర్ణ.

చేతనా చేతనావస్థల మధ్య స్థితప్రజ్ఞుడిలా ఉన్నాడు శ్రీధర్. ఊహించని పరిణామానికి సింధూరంలా ఎరుపెక్కిన మనసులో శిఖరాన్ని తాకే ఆలోచన్ల వెల్లువ.

సహృదయతలోను, వ్యక్తిత్వంలోను ధ్రువనక్షత్రంలా వెలిగిపోతున్న అపర్ణ, అతని కళ్ళముందు దేదీవ్యమానంగా ప్రకాశిస్తోంది. ఆమె కరిక తీరుస్తా నన్నట్లుగా అతడి పెదిమల మీద సన్నటి నవ్వు. అప్పటికే బాగా తెల్లవారింది. ★

